PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 38 | పేజీలు : 8 | బుధవారం 1 జూలై 2026 | వెల : 4/-




## సాదాబైనామా భూముల
# సమస్యకు చెక్

- అర్హులైన వారికి పట్టాదారు హక్కులు
- ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల నోటీసులు జారీ
- గ్రామస్థాయి విచారణ నిర్వహించి భూములపై అభ్యంతరాల స్వీకరణ
- సాదాబైనామాలకు భూభారతిలో ఇప్పటికే 3.65 లక్షలకుపైగా పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ



హైదరాబాద్

తెలంగాణలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా భూముల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. 9.25 లక్షల దరఖాస్తులను పరిశీలించి 6 లక్షలకుపైగా నోటీసులను రెవెన్యూ శాఖ జారీ చేసింది. నిర్ణీత గడువులోగా విచారణలు పూర్తి చేసి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందజేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణలో సాదాబైనామా భూముల సమస్య దశాబ్దాలుగా రైతులను వెంటాడుతోంది. అధికారిక రిజిస్ట్రేషన్ లేకుండా తెల్ల కాగితాలపై జరిగిన భూముల క్రయవిక్రయాలు అధికారిక రికార్డుల్లో నమోదు కాకపోవడంతో లక్షలాది మంది రైతులు తమ భూములపై చట్టబద్ధమైన హక్కులు పొందలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 9.25 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వారు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పంట బీమా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. 2020లో అప్పటి బీఆర్ఎస్ - మిగతా3లో



## రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం

- దేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, జాతీయ భద్రతే మూలస్తంభాలు
- దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయి
- వడోదరలో వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ మంత్రి ప్రసంగం
- 2003లో ప్రారంభమైన వైబ్రంట్ గుజరాత్ ఇప్పుడు వికసిత్ భారత్ లక్ష్యానికి జాతీయ ఉద్యమంగా మారిందన్న రాజ్‌నాథ్

## రైతుల ఖాతాల్లో
# రూ.9,000 కోట్లు

- రైతు భరోసాతో తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక కానుక
- ఖరీఫ్ నుంచే 7 రకాల సన్న వడ్లకు బోనస్
- రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- రెండున్నరేళ్లలో రైతుల కోసం రూ.80 వేల కోట్ల వ్యయం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్

తెలంగాణ రైతాంగం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయం అమలు చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన రైతు భరోసా సదస్సులో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులతో కలిసి పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ రోజు నుంచే రాష్ట్రవ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను నేరుగా జమ చేస్తున్నామని ప్రకటించారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని... రైతు నవ్వితేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని" అన్న నమ్మకంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల్లో - మిగతా3లో




## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా
# తెలంగాణ

- హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం
- గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...
- కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్
- 'మేడ్ ఇన్ తెలంగాణ' ఇప్పుడు ప్రపంచ అత్యాధునిక యుద్ధ విమానాల్లో ఎగురుతోంది
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్

ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర - మిగతా3లో

## ఏముందో అదే చెబుతా...
# చెప్పిందే చేస్తా




- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నా రాజకీయ జీవితం
- బెల్టు షాపులు తప్ప కేసీఆర్ పాలనలో వచ్చినవేమీ లేవు
- కూలిన 'కాళేశ్వరం' నుంచి చుక్క నీరు తీసుకోకున్నా పంటలు పండాయి
- వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ తెచ్చి బిల్లులు మాఫీ చేశారు
- రైతు భరోసా ఖరీఫ్ నిధుల విడుదల సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- భవిష్యత్తులో పంట వేసిన రైతులకే భరోసా: మంత్రి తుమ్మల

హైదరాబాద్


'అధికారం కోసం అబద్ధాలు చెప్పను. ఏముందో అదే చెబుతా... చెప్పిందే చేస్తా. అబద్ధాల పునాదులపై ప్రభుత్వం నడపను. ఈ ప్రభుత్వం రైతులది, పేదలది, మహిళలది, నిరుద్యోగులది. పదవి శాశ్వతం కాదు... మాట శాశ్వ తం. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నా రాజకీయ జీవితం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబా ద్‌లోని శిల్పకళా వేదికలో రైతు భరోసా పథకం కింద ఖరీఫ్ పెట్టుబడి - మిగతా3లో




## హర్మూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం

- పశ్చిమాసియా తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ప్రధాని మోదీ చర్చ
- హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌తో పాటు ప్రపంచానికి కీలకమని స్పష్టం
- హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని!
- అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి

## ప్రజల జీవితాల్లో
# మార్పే లక్ష్యంగా



- కేంద్ర కార్యదర్శులతో ప్రధాని మోదీ కీలక సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆత్మనిర్భర్ భారత్‌పై ప్రధాని నరేంద్ర మోదీ సమీక్ష
- ప్రభుత్వ పథకాల ప్రభావం ప్రజల జీవితాల్లో స్పష్టంగా కనిపించాలని ఆదేశం
- మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలి
- శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుంది



## ఇక డాలర్‌తో పనిలేదు... భారత్-జపాన్ కీలక ఒప్పందం!

- డాలర్‌ను పక్కనపెట్టి యెన్-రూపాయి ప్రత్యక్ష లావాదేవీలకు భారత్-జపాన్ సన్నాహాలు
- ప్రధాని మోదీతో జపాన్ ప్రధాని సనాయె తకైచి భేటీలో కీలక చర్చ
- తగ్గనున్న ఫారెక్స్, లావాదేవీల ఖర్చులు.. వేగవంతం కానున్న వాణిజ్యం
- భారత్‌లో జపాన్ కంపెనీలకు ప్రోత్సాహం.. పెరగనున్న ప్రైవేట్ పెట్టుబడులు
- త్వరలో ఆర్‌బీఐ, జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య అవగాహన ఒప్పందం



## గ్రామ పంచాయతీలదే
# కీలక పాత్ర

- జులై 1 నుంచే వీబీజీ రామ్‌జీ చట్టం అమలు
- రూ.కోట్లల్లో బకాయిలు చెల్లించలేదని కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- MGNREGA స్థానంలో వీబీజీ రామ్‌జీ చట్టం జులై 1 నుంచే అమల్లోకి
- రాష్ట్రాలపై భారం పెరుగుతుందని, బకాయిలు చెల్లించలేదని కాంగ్రెస్ ఆరోపణలు

నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
1 జూలై 2026

# హర్మూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం





పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రాంతీయ శాంతి, హర్మూజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛ వంటి కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ఇరాన్ అధ్యక్షుడు ప్రధానికి వివరించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. అలాగే భవిష్యత్ కార్యాచరణపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపింది. ఫోన్ సంభాషణలో ప్రధాని మోదీ, చర్చల ద్వారా సాధించిన పురోగతిని స్వాగతించారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. ప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం నెలకొనేలా అన్ని వర్గాలు కృషి కొనసాగించాలని సూచించారు. అంతేకాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్య రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భారత్‌కు ఇంధన అవసరాల్లో గల్ఫ్ దేశాల ప్రాధాన్యం దృష్ట్యా హర్మూజ్ జలసంధి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. ప్రపంచంలో సముద్ర మార్గంలో తరలించే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడటంతో పాటు భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు పీఎంఓ పేర్కొంది.

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ కూడా పశ్చిమాసియాలోని తాజా పరిణామాలను ప్రధానికి వివరించారు. ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, శాంతి ప్రయత్నాలు, తదుపరి చర్యల గురించి ఆయన వివరణ ఇచ్చినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్?లో స్పందించారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. చర్చల్లో సాధించిన పురోగతిని స్వాగతించానని, కొనసాగుతున్న ప్రయత్నాలు ప్రాంతంలో శాశ్వత శాంతికి దారి తీస్తాయని ఆశాభావం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే హర్మూజ్?లో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌కే కాకుండా ప్రపంచానికే అత్యంత ముఖ్యమని మరోసారి పునరుద్ఘాటించినట్లు వెల్లడించారు.

**14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం**

ఇటీవలి కాలంలో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ మధ్య జరిగిన వరుస చర్చల్లో ఇది మరో ముఖ్యమైన సంభాషణగా భావిస్తున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, సముద్ర వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై భారత్ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజుల క్రితం అమెరికా-ఇరాన్ మధ్య 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరినట్లు సమాచారం వెలువడింది. ఇందులో హోర్ముజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరవడం, ఇరాన్‌పై అమలులో ఉన్న కొన్ని ఆర్థిక పరిమితులను సడలించడం వంటి అంశాలు ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడి మధ్య తాజా చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే అమెరికాతో సమీప భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ స్థాయి సమావేశాలు నిర్వహించే ప్రణాళిక ప్రస్తుతం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి మీడియాతో మాట్లాడుతూ, అమెరికా ప్రతినిధులతో రాబోయే రోజుల్లో ఏ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించే యోచన లేదన్నారు. దోహాలో జరగబోయే సమావేశాలు అమెరికాతో రాజకీయ చర్చలు కాదని, ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందంలోని అంశాల అమలుకు సంబంధించిన సాంకేతిక స్థాయి చర్చలేనని వివరించారు. ప్రత్యేకంగా ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన ఆర్థిక ఆస్తుల విడుదల, ఒప్పందంలోని ఇతర నిబంధనల అమలుపై ఖతార్ ప్రతినిధులతో చర్చలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. మరోవైపు, పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు భారత్ ఎప్పటినుంచో సమతుల్య వైఖరినే అవలంబిస్తోంది. వివాదాలను యుద్ధం ద్వారా కాకుండా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అదే సమయంలో భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకేతాన్ని కూడా ఇస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో జరిపిన తాజా టెలిఫోన్ సంభాషణ పశ్చిమాసియా పరిణామాలపై భారత వైఖరిని మరోసారి స్పష్టంగా తెలియజేసింది.

# ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యంగా



కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, ఆయా శాఖల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సేవా తీర్థ్‌లో కీలక సమావేశం నిర్వహించారు. దేశంలో పరిపాలనా సంస్కరణల్ని వేగవంతం చేయడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపర్చడం, ప్రజలకు ప్రభుత్వ సేవల్ని సులభతరం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అలాగే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్లడం, వేగంగా అమలు చేయడం కూడా ఈ 4 గంటల ఉన్నత స్థాయి సమావేశంలో చర్చకు వచ్చింది. సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మొదటిది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం డీ- రెగ్యులేషన్ (అనవసర నిబంధనల సరళీకరణ), ఇతర పరిపాలనా సంస్కరణలు' అంటే అంటే వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం సహా పౌరుల రోజువారీ జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చడం. ఇక రెండోది 'ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేయడం'. వివిధ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించడం. ఈ సందర్భంగా వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు తమ శాఖలు చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రధానికి వివరించారు. ప్రధాని విజన్‌ను కార్యచరణగా మార్చేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి రూపొందించిన భవిష్యత్తు వ్యూహాల్ని కూడా వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ- ప్రభుత్వ శాఖలు విడివిడిగా కాకుండా పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు ప్రధాని.

**ప్రభుత్వ పథకాల అమలు- ప్రజల జీవితాల్లో మార్పుపై దిశానిర్దేశం**

వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, డేటా ఆధారిత నిర్ణయాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం గతిశక్తి ప్లాట్‌ఫారంను మరింత విస్తృతంగా వినియోగించాలని ప్రధాని సూచించారు. ఈ వేదిక ద్వారా మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత సులభతరమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల విజయాన్ని కేవలం అవి అమలవుతున్నాయా లేదా అన్నదానితో కాకుండా వాటి వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందనే దానితోనే అంచనా వేయాలని ప్రధాని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ తదితరులు పాల్గొన్నారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మొట్టమొదటి పూర్తి స్థాయి కార్యదర్శుల స్థాయి సమావేశంగా తెలుస్తోంది. 2026 రెండో అర్ధభాగానికి సంబంధించి ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం కూడా సమావేశం ఉద్దేశంగా తెలుస్తోంది.

**మోదీ విజన్ లక్ష్యాలకు అనుగుణంగా- దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి**

ఇక తాజా సమావేశంలో జరిగిన చర్చలు జూన్ 21న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించిన సంస్కరణల కార్యచరణకు కొనసాగింపుగా నిలిచాయి. అప్పుడు కూడా ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపర్చడంతో పాటుగా యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి (2047, ఆగస్ట్ 15) అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టాలన్న మోదీ దార్శనికతలో భాగంగా ప్రభుత్వం దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి సారిస్తున్న తరుణంలో ఈ మీటింగ్ జరిగింది. మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు మార్కెట్లలో అస్థిరత వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరును కనబరుస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇక డాలర్‌తో పనిలేదు...

## భారత్-జపాన్ కీలక ఒప్పందం!

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు (అశీఅ-తీవంఱఎవత్ం) భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×), జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్-జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

## గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఉద్దేశించిన వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం-వీబీజీ రామ్‌జీ యాక్ట్- 2025 ఈ జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రాబోతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్నటువంటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలోనే ఈ కొత్త వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకారం కొత్త చట్టం కింద అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 100 రోజులకు బదులుగా 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధ హామీ లభిస్తుంది. ఈ పథకం అమలుకు అవసరమైన పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక ఏర్పాట్లు పూర్తయ్యాయని కేంద్రం తెలిపింది. అయితే ఈ పథకం మార్పుపై కాంగ్రెస్ పార్టీతో సహా గ్రామీణ ఉపాధి హక్కుల కార్యకర్తలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం అమలు కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 95,692.31 కోట్ల మేర తాత్కాలిక నిధులు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కొత్త వ్యవస్థలో అంతా సజావుగా జరిగి, కార్మికులకు వేతనాలు కూడా ఆలస్యం కాకుండా అందుతాయని పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ- 'పనిచేయాలనుకునే ఒక్క అర్హుడైన గ్రామీణ కార్మికుడు కూడా ఉపాధి లేకుండా ఉండకూడదనేదే ప్రభుత్వ లక్ష్యం' అని చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి ఈ చట్టం అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

**గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర**

ప్రస్తుతం ఈ- కేవైసీ ధ్రువీకరణ పొందిన జాబ్ కార్డులు, కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు చెల్లుబాటులోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే గ్రామ పంచాయతీలే పథకం అమలులో ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపింది. నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతులు, మహిళా సాధికారత వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటికే బడ్జెట్ కేటాయించగా, 24 రాష్ట్రాలు తమ రాష్ట్ర స్థాయి ఎదీ- + =ూవీ + పథకాల నోటిఫికేషన్లు జారీ చేశాయి.

**రాష్ట్రాలపైనే భారం మోపుతున్న కేంద్రం: కాంగ్రెస్ విమర్శలు**

కొత్త వీబీ జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శలు చేసింది. కొత్త పథకాన్ని తీసుకొచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. లోక్‌సభలో ఇచ్చిన సమాచారం ప్రకారం 2026 మార్చి నాటికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 17144.13 కోట్ల ఎంజీనరేగా బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీంట్లో రూ. 7846.25 కోట్లు కార్మికుల వేతన బకాయిలే ఉన్నాయని తెలిపారు. కర్ణాటక, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు కోట్లల్లో బకాయిలు విడుదల కాలేదని ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో వీ+చీ=జు+ూ లో కార్మికుల వేతన వ్యయాల్ని కేంద్రమే పూర్తిగా భరించేదని, ఇప్పుడు కొత్త పథకంలో మొత్తం వ్యయంలో 40 శాతం భారాన్ని రాష్ట్రాలపైనే మోపుతున్నారని విమర్శలు గుప్పించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల బ్లాక్ అవుట్ నిబంధన వల్ల గ్రామీణ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, దీనిని పునఃసమీక్షించాలని పలు రాష్ట్రాలు కోరుతున్నట్లు ఖర్గే తెలిపారు. ఇంకా రోజువారీ కూలీని రూ. 400 కు పెంచాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండిస్తోంది. వీబీ జీ రామ్ జీ యాక్ట్ గ్రామీణ జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తుందని, ఉపాధి అవకాశాల్ని పెంచడంతో పాటుగా గ్రామీణ ఆస్తుల సృష్టికి దోహదపడుతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త చట్టం జాతీయ స్థాయిలో ప్రారంభ కార్యక్రమం జులై 2న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లి గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డుల పంపిణీతో పాటుగా పథకంపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

# రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం



బలమైన ఆర్థిక వ్యవస్థ, అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం, పటిష్ఠమైన జాతీయ భద్రత ఈ మూడూ ఒక గొప్ప దేశానికి మూలస్తంభాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక గత రెండు దశాబ్దాల్లో గుజరాత్ అభివృద్ధికే కాకుండా దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను కూడా తాను సందర్శించినట్లు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), గిరిజన ఉత్పత్తులు, భారీ పరిశ్రమలు, రక్షణ రంగానికి సంబంధించిన అనేక విభాగాలు ఇందులో పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయమని చెప్పారు. దేశంలో ప్రైవేటు పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**మోదీ కూడా ఈ నేల నుంచే!**

గుజరాత్ దేశానికి ఎన్నో గొప్ప నాయకులను అందించిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి మహానుభావులతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ నేల నుంచే ఎదిగారని చెప్పారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ మరింత పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ వేదికల్లో భారత్ మాట్లాడితే ప్రపంచ దేశాలు ఆసక్తిగా వినే పరిస్థితి ఏర్పడిందని, దీనికి నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. వైబ్రంట్ గుజరాత్ కార్యక్రమం 2003లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ప్రారంభించారని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. అప్పట్లో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రారంభమైన ఈ వేదిక, ఇప్పుడు దేశ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. గత 20 ఏళ్లలో గుజరాత్‌లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం దేశ ఆర్థికాభివృద్ధికి గుజరాత్ గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. తాను రక్షణ మంత్రిగా వైబ్రంట్ గుజరాత్ సదస్సుకు రావడంపై కొందరికి సందేహాలు రావొచ్చని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే ఆర్థికాభివృద్ధి, జాతీయ భద్రత రెండూ విడదీయరాని అంశాలని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఉంటేనే దేశ భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని తెలిపారు. అలాగే రక్షణ రంగం అభివృద్ధి అంటే కేవలం ఆయుధాల తయారీ మాత్రమే కాదని, దాని ద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, సాంకేతిక రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వీటి ద్వారా తయారీ రంగం విస్తరించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్న నేపథ్యంలో భారత పరిశ్రమలు కూడా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

**ఒకదానితో ఒకటి అనుసంధానమై!**

గొప్ప దేశాలు మూడు ప్రధాన ఆధారాలపై నిలబడతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మొదటిది బలమైన ఆర్థిక వ్యవస్థ, రెండోది సాంకేతిక సామర్థ్యం, మూడోది జాతీయ భద్రత అని వివరించారు. ఈ మూడు పరస్పరం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయని చెప్పారు. ఆర్థికంగా బలమైన దేశం సాంకేతికంగా కూడా ముందంజలో ఉంటుందని, అలాంటి దేశంలో భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో జాతీయ భద్రత బలంగా ఉన్నప్పుడు పరిశ్రమలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు వేగంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై భారత్ పోషించే పాత్ర దేశ స్వావలంబన, సాంకేతిక సామర్థ్యం, ప్రజల సమష్టి సంకల్పంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం అన్ని రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని, పరిశ్రమలు, స్టార్టప్‌లు, రక్షణ తయారీ, సాంకేతిక రంగాలు కలిసి పనిచేస్తే భారత్ ప్రపంచంలో మరింత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక కేవలం పెట్టుబడుల సదస్సుగా మాత్రమే కాకుండా దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికగా మారిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, యువ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్ణీత సమయంలోనే సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏముందో అదే చెబుతా... చెప్పిందే చేస్తా

-మొదటిపేజీ తరువాయి

సాయం విడుదల సందర్భంగా నిర్వహించిన రైతు భరోసా సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ మళ్లీ వస్తాడని ఇద్దరు పిల్ల రాక్షసులు చెబుతున్నారని.. ఆయన రావడం వల్ల ఆ కుటుంబానికే ఉపయోగం తప్ప ప్రజలకు ఒనగూరేదేముందని సీఎం ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారని.. అయితే బెంగాల్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీకి 15 ఏళ్లు పట్టిందని.. ఇక్కడ కూడా అలాగే వేచి ఉండాలని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని చెప్పారు. రైతుల కోసం ప్రతినెలా రూ. 6 వేల కోట్ల చొప్పున గత 30 నెలల్లో రూ. 1.75 లక్షల కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పంటా కాళేశ్వరం నీళ్లతోనే పండుతోందని బీఆర్ఎస్ నేతలు చెప్పుకొనే వాళ్లని.. కానీ మూడేళ్లుగా అక్కడి నుంచి చుక్క నీరు రాకపోయినా తెలంగాణ రైతులు 2 కోట్ల 80 లక్షల టన్నుల ధాన్యం ఎలా పండించారో చెప్పాలని సీఎం ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో వరి పండించి క్వింటా రూ. 4,200కు అమ్ముకున్నాయన వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టారని విమర్శించారు.

**కేసీఆర్ మళ్లీ వస్తాడా... ఎందుకు?**

ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో అయిన అప్పు రూ. 69 వేల కోట్లు అయితే, పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం రూ. 7 లక్షల కోట్లకుపైగా అప్పు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు కూడా విడతలవారీగా ఇచ్చారని.. బడి పిల్లల భోజన బిల్లులు, యూనిఫాం బిల్లులు, స్వయం సహాయక సంఘాల బకాయిలు, సర్పంచుల బిల్లులు... ఇలా ఏ ఒక్కటీ చెల్లించకుండా వెళ్లిపోయారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు అయిందో లేదో అప్పుడే దిగిపోవాలంటున్నారని.. అడగగానే దిగిపోవడానికి తాము గడీల ముందు బానిసలమా? అని సీఎం ప్రశ్నించారు. 'కేసీఆర్ మళ్లీ వస్తే ప్రజలకు ఏం చేస్తడు. ప్రజలకేం ఇచ్చిండని వస్తడు? మొగుడు పెళ్లాలు మాట్లాడుకునే మాటలు వినడానికా? రైతు బజార్లు తీసుకురావాల్సింది పోయి బెల్టు షాపులు తీసుకొచ్చారు. రాష్ట్రంలో తాగుడు సంస్కృతిని పెంచారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. దళితులకు 3 ఎకరాల చొప్పున భూపంపిణీ ఇవ్వలేదు. రూ. లక్ష చొప్పున రైతులకు రుణమాఫీ చేయలేదు. మేం సంసారాల్లో చిచ్చుపెట్టే తప్పుడు రాజకీయాలు చేయం. ఫోన్ ట్యాపింగ్ లాంటి పనులు మా ప్రభుత్వంలో ఉండవు'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**మోదీ వచ్చి మోరీ తీస్తడా?**

'తెలంగాణలో కూడా మోదీ పాలన వస్తదని బీజేపీ నేతలు



అంటున్నారు. అయినా మోదీ వచ్చి మోరీ తీస్తాడా? ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోదీ చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ లెక్కన 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు రావాలి. ఎక్కడ ఉన్నాయి ఆ ఉద్యోగాలు? తెలంగాణలో బండి సంజయ్, కిషన్‌రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు'అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్**

'ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్. వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత విద్యుత్‌పై సంతకం చేశారు. రూ. 12 వేల కోట్ల విద్యుత్ బిల్లులను కూడా మాఫీ చేశారు. ఎవరైనా ఉచిత విద్యుత్ ఇచ్చామంటే ఉరికించి కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు కూడా ఉచిత విద్యుత్ కోసం గత 30 నెలల్లో రూ. 30 వేల కోట్లు వెచ్చించాం. ప్రతిపక్ష నాయకులు మూసీ అభివృద్ధి వద్దంటారు... మెట్రో వద్దంటారు... రీజనల్ రింగ్ రోడ్ వద్దంటారు... పోర్లు దండాలు పెట్టినా అభివృద్ధి పనులు ఆపం'అని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.

**పంట మార్పిడి తప్పనిసరి**

ఈసారి వర్షాలు తక్కువగా పడే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నందున వర్షాలను బట్టి రైతులు పంటలు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 'మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాం. రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు వేయాలి. పంట మార్పిడి చేయాలని శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు నేను చెబితే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అబద్ధాలు చెప్పుకుంటూ బతకాలనే శాపం బావబామ్మర్దులకు ఉన్నట్లుంది. అందుకే పోటీ పడి అబద్ధాలు చెబుతున్నారు. ఎవరేం చెప్పినా 9 రోజుల్లో రైతుభరోసా కింద రూ. 9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**భూమి భరోసా కాదు... పంటకు భరోసా: మంత్రి తుమ్మల**

భవిష్యత్తులో పంట వేసిన వారికే రైతు భరోసా అందించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ఇది భూమి భరోసా కాదని, పంటకు ఇచ్చే భరోసా అని స్పష్టం చేశారు. పంటల మార్పిడి చేయాలని, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు పప్పు దినుసులు పండించాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా, రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపులతో రైతుల జీవితాల్లో నమ్మకాన్ని నింపామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితోపాటు రైతు వేదికల నుంచి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్--2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ & డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, "ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా" అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. "ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి" అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్--16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. "'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది" అని పేర్కొన్నారు. స్పెయిన్‌కు చెందిన ×ూ ూావతీశీ, కెనడాకు చెందిన ఖీ+ూావతీశీంజూఖఎవ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు.




డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు.

తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.

వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌర-సైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు.

ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు. ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం మీకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వం" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. "ఏరోమార్ట్ హైదరాబాద్--2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## వరంగల్ కొత్త మాస్టర్ ప్లాన్

**వరంగల్ :** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో రాబోయే కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రతిపాదనలపై స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇన్వెస్టర్లలో ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తోంది. నగరాభివృద్ధి సంస్థ కుడా ప్రతిపాదిస్తున్న నూతన మాస్టర్ ప్లాన్ మార్పుల తాలూకు లీకేజీలు, ఊహాగానాలు మార్కెట్ వర్గాల్లో ఒక రకమైన ఉత్కంఠను రేపుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా తుది ప్లాన్‌ను ప్రకటించక ముందే వేర్వేరు జోన్లపై వస్తున్న లీకేజీల వల్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. ఈ తాజా పరిణామాలతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల కొనుగోళ్లు తాత్కాలికంగా మందగించాయి. వ్యవసాయ జోన్ ఎటు మారుతుంది? గ్రీన్ జోన్, కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్ల సరిహద్దులు ఎక్కడ ఖరారవుతాయి? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. ఏ ఒక్క జోన్ తారుమారైనా తాము పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి చిక్కుల్లో పడుతుందనే అయోమయంతో ఇన్వెస్టర్లు, అటు నాలా కన్వర్షన్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లు తమ కొత్త వెంచర్ల లాంచింగ్‌లను కొద్దిరోజుల పాటు హోల్డ్‌లో



పెట్టారు. ఔటర్ పరిసరాల్లో ఈ విధమైన నిస్తేజం కనిపిస్తున్నప్పటికీ, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఏరియాల్లో మాత్రం స్థిరాస్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నగర నడిబొడ్డున , ఐఆర్ఆర్ కనెక్టివిటీ ఉన్న ప్రధాన లేఅవుట్లలో ఎలాంటి జోనింగ్ భయాలు లేకపోవడంతో గజం ధరలు యథాతథంగా ఉన్నాయి. పైగా, భవిష్యత్తులో మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే నగర కేంద్రంలో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందనే అంచనాతో ఇన్నర్ ఏరియాల్లో ఉన్న బిట్లను దక్కించుకోవడానికి కొందరు మదుపరులు ఇప్పటికీ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ గందరగోళానికి తెరపడాలంటే ప్రభుత్వం త్వరితగతిన కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను అధికారికంగా విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని స్థానిక రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. ప్లాన్‌పై పూర్తి స్థాయి పారదర్శకత వస్తేనే గ్రేటర్ వరంగల్ పరిధిలో మళ్లీ ప్లాట్ల క్రయవిక్రయాలు ఊపందుకుంటాయని, అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడి మార్కెట్‌లో నమ్మకం పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు.

## రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన ప్రతి రైతు హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం ఇదేనని అన్నారు. ఖరీఫ్ సీజన్ నుంచే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏడు రకాల సన్న వడ్లకు బోనస్ అందిస్తామని ప్రకటించిన మంత్రి, రైతు పండించిన ప్రతి గింజకు విలువ పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ధాన్యం ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు అనుకూల విధానాలు, సకాలంలో ధాన్యం కొనుగోలు, వేగంగా రైతుల ఖాతాల్లో చెల్లింపులు, నాణ్యమైన విత్తనాలు, సాగునీటి లభ్యత వంటి చర్యలతో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రైతు సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపులతో రైతుల జీవితాల్లో నమ్మకాన్ని నింపామని చెప్పారు.

రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి రైతు సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.80 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని, ఇది దేశంలోనే రైతు సంక్షేమంపై అత్యధిక పెట్టుబడి పెట్టిన ప్రభుత్వాల్లో తెలంగాణను నిలబెట్టిందని తెలిపారు. "మాటలు కాదు... చేతలు. హామీలు కాదు... అమలు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేకత" అని మంత్రి పేర్కొన్నారు. రైతు కష్టానికి గౌరవం, పంటకు గిట్టుబాటు ధర, సాగుకు భరోసా, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగం కోసం ప్రతి నిర్ణయం తీసుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతు సంక్షేమం, రైతు గౌరవం, రైతు ఆర్థికాభివృద్ధే తమ ప్రభుత్వ పరమావధి అని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## సాదాబైనామా భూముల సమస్యకు చెక్

-మొదటిపేజీ తరువాయి



ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం దరఖాస్తులను స్వీకరించింది. అయితే న్యాయపరమైన వివాదాలు, చట్టపరమైన అడ్డంకులు ఎదురుకావడంతో సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఏ మాత్రం ముందుకు సాగలేదు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అలాగే సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక నిబంధనలు రూపొందించింది.

**6 లక్షల మందికి నోటీసులు**

సాదా బైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన వారిలో అర్హత కలిగిన చిన్న, సన్నకారు రైతులకు ఆ భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మందికి నోటీసులు జారీ చేయగా మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**అర్హులైన వారికి పట్టా పాస్‌బుక్‌లు**

సాదాబైనామా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అర్హత ఉన్న దరఖాస్తులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో గ్రామస్థాయిలో విచారణలు నిర్వహించి సంబంధిత భూములపై అభ్యంతరాలను స్వీకరించి, నిశితంగా పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి సెక్షన్ 13(బీ) ప్రక్రియ ద్వారా సంబంధిత భూములపై పట్టాదార్ హక్కులు కల్పిస్తారు.

**3 లక్షల మందికి పైగా పట్టాలు జారీ**

భూభారతి అమలులో భాగంగా సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ప్రభుత్వం దానిని దశల వారీగా అన్ని జిల్లాలకు విస్తరించాలని నిర్ణయించింది. భూమి సర్వే, స్టాంపులు- రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డులను ఒకే వ్యవస్థలో సమన్వయం చేయడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 3.65 లక్షలకుపైగా పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు ప్రభుత్వ అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

## గుర్రంగూడ ఫారెస్ట్ లో కేబీఆర్ తరహా ఎకో పార్కు..

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు తరహాలో అధునాతన ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ పనులు ప్రారంభించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న అటవీ భూమిలో 142 ఎకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబరు లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్‌లు, వాక్‌వేలు, ధ్యానమందిరాలతో పాటు సందర్శకుల రద్దీ నియంత్రణకు ఐదు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యాధునిక హంగులతో సరికొత్త ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ ముమ్మర కార్యాచరణ ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును తలపించేలా.. అన్ని రకాల అధునాతన సౌకర్యాలతో ఈ పార్కును రూపొందించనున్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన చేశారు.

అనంతరం అటవీశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదిత నివేదికను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ఎకో పార్కు పనులను ఈ ఏడాది డిసెంబరులోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం 424 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. అందులో 142 ఎకరాలను ప్రత్యేకంగా ఎకో పార్కు అభివృద్ధి కోసం కేటాయించారు. ఈ పార్కులో సందర్శకుల కోసం సైక్లింగ్ ట్రాక్‌లు, ఆహ్లాదకరమైన వాక్‌వేలు, ప్రశాంత వాతావరణంలో యోగా చేసుకునేందుకు ధ్యానమందిరాలను నిర్మించనున్నారు. అలాగే వివిధ అధికారిక, అనధికారిక సమావేశాల నిర్వహణకు వేదికలు, సందర్శకులు కూర్చుని మాట్లాడుకునేందుకు వీలుగా పచ్చిక బయళ్లలో ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు సుమారు 30 వేల మంది సందర్శకులు వచ్చినా తట్టుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ఒకేసారి వస్తే ప్రవేశ ద్వారాల వద్ద రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా పార్కుకు ఐదు వేర్వేరు చోట్ల ప్రధాన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నారు. వారాంతాల్లో కుటుంబాలతో గడిపేవారి కోసం ప్రత్యేక యాక్టివిటీ జోన్లు, పిల్లల వినోదం కోసం ప్లేజోన్లను కూడా సిద్ధం చేస్తున్నారు. గతంలో గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ భూములంటూ ఆక్రమించుకుని కోర్టులను ఆశ్రయించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి కస్నా నాయక్‌లు లీగల్ టీమ్‌తో కలిసి పక్కా ఆధారాలు సేకరించారు. ప్రైవేటు వ్యక్తులు కోర్టులో సమర్పించిన ధ్రువపత్రాలు నకిలీవని నిరూపించడంలో వారు విజయం సాధించారు. దీంతో ఆ భూములు పూర్తిగా అటవీశాఖవేనని స్పష్టం చేస్తూ గతేడాది సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పు అనంతరం అటవీశాఖ ఆక్రమణలను తొలగించి రికార్డులను సరిచేసింది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోంచి దక్కించుకున్న 116 ఎకరాల భూమిని స్పష్టంగా గుర్తిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్రమణల నుంచి విముక్తి పొందిన ఈ అటవీ భూమి ఇప్పుడు నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని, ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన హరితవనంగా మారబోతోంది.

## సంపాదకీయం

# వ్యవసాయ సంక్షోభం తప్పదా

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం.గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది.దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్-రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది.ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు.అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది.చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం

# కేబినెట్ ఫైట్... శాఖల మార్పులు తప్పవా



తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు పదవీ గండం తొలగిపోయినట్టేనని జాతీయ మీడియా సహా.. బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నెలలోనే అంటే.. కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన రాగానే అదే రోజు లేదా ఈ నెల 30 నాటికి మంత్రి వర్గ మార్పు ఉంటుందని జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోంది.ఇటీవలే ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి వర్గ ప్రక్షాళనపైనే ఆమెతో చర్చించినట్టు కూడా వార్తలు రాగా.. తాజాగా మరో విషయం వెలుగు చూసింది. మంత్రుల కూర్పుపై పలు పేర్లతో కూడిన జాబితాను కూడా రాష్ట్రపతికి ప్రధాని అందించారని జాతీయ మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ చోటు ఏమాత్రం చెదిరిపోదన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బండి భగీరథ్ వ్యవహారం తెరమీదికి వచ్చిన తర్వాత.. కేంద్ర మంత్రిగా సంజయ్‌ను తప్పిస్తారన్న చర్చ సాగింది.కానీ, ఈ విషయంలో బండి ప్రమేయం లేదని.. ఆయన పార్టీకి చేసిన సేవల నేపథ్యంలోనే పదవి లభించిందన్న వాదన ఉంది. పైగా.. పార్టీకి కుటుంబ వ్యవహారాలకు కూడా సంబంధం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ సీటు విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మొత్తం ఐదుగురు మంత్రులు ఉండగా.. బండి సంజయ్‌ను అలానే కొనసాగించినా.. మిగిలిన నలుగురి విషయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడును పర్యాటక శాఖ మంత్రిగా(ఇండిపెండెంట్ )గా పంపించే అవకాశం ఉందని గట్టిగా చెబుతున్నారు.ఇక, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం కిషన్ రెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అలానే.. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విషయంలోనూ మార్పు ఉండే అవకాశం ఉందని.. ఆయనను కూడాహోం శాఖ పరిధిలోకి తీసుకుంటారని అంటున్నారు. ఇక, బీజేపీ నాయకుడు, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ.. ప్రస్తుతం కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనను కూడా మార్పు చేసి.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ మార్పులు చేర్పులు ఉండడం మినహా మంత్రులను తప్పించే అవకాశం లేదని సమాచారం.

**నిర్మలమ్మ స్థానంలో శక్తికాంత్ దాస్**

కేంద్ర మంత్రివర్గంలో ప్రక్షాళన ఖాయమనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కీలకమైన ఆర్థిక శాఖ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 10 సంవత్సరాలుగా ఈ శాఖకు మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను తప్పించడం ఖాయమని ఢిల్లీ వర్గాలు సహా.. బీజేపీ పెద్దలు కూడా చూచాయగా చెబుతున్నారు. అంతేకాదు.. ఆమె స్థానంలో ఆర్ బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో శక్తికాంత దాస్.. చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇది ఇప్పుడు ఆయనకు కలిసి వస్తుందని అంటున్నారు.గత 10 సంవత్సరాలకు పైగానే కేంద్ర ఆర్థిక మంత్రిగా అపర చాణిక్యురాలిగా పేరొందిన నిర్మలా సీతారామన్‌ను మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని జాతీయ మీడియా పేర్కొంది. గత రెండేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు.. ఆర్థిక కార్యకలాపాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న దరిమిలా.. త్వరలోనే జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వ్యవహారం కూడా దీనికి లింకుగా ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహాన్ని తగ్గించేందుకు.. దేశంలో ఆర్థిక సమస్యలు తగ్గించి.. కార్యకలాపాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంటోంది.డాలర్‌తో పోలిస్తే.. గత రెండేళ్లుగా రూపాయి మారకం విలువ పడిపోతోంది. అదేసమయంలో స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు.. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించడం.. మరోవైపు పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు వంటి వాటిని సమర్థవంతంగా నిర్మలమ్మ ఎదుర్కొనలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను తప్పించడం ఖాయమని చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించకుండా.. శాఖను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉందని పెద్ద ఎత్తున బీజేపీ నాయకుల మధ్య కూడా చర్చ సాగుతోంది.ఇక, శక్తికాంత దాస్ విషయానికి వస్తే.. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన కరోనా వంటి కీలక సమయంలోనూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక స్థితి మందగమనంలో ఉన్నప్పుడు కూడా భారత్ తనను తాను నిలబెట్టుకు నేలా ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఆర్థిక రిజర్వ్‌లు తగ్గిపోకుండా చూశారు. ఇవన్నీ భవిష్యత్తులో దేశాన్ని మరోసారి నిలబెట్టే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. కాగా.. ప్రస్తుతం శక్తికాంతదాస్ పార్లమెంటుకు ఏ సభ నుంచి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ.. ఆయనను మంత్రిగా తీసుకుని.. తర్వాత రాజ్యసభకు ప్రమోట్ చేయించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పోలవరం ముంపు.. తెలంగాణకు ముప్పు



ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భారీ వర్షాలు, వరదల వల్ల తెలంగాణ భూభాగంలోని భద్రాచలం పరిసరాల్లోని గోదావరి తీర ప్రాంతంలో పెను విధ్వంసం జరుగనున్నది. ఈ వాస్తవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం గ్రహించాలి. దిగువన డ్యామ్ నిర్మాణంతో కాఫర్ డ్యామ్, స్పిల్ వే వల్ల బ్యాక్ వాటర్ (నదిలో స్థిరంగా ఉండే నీళ్లు) చుట్టుముడుతాయి. ముంపు మండలాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారే ప్రమాదం ఉన్నది. వరదలు వస్తే 30 రోజుల పాటు జనావాసాలు జలమయమై తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, చేయడానికి పనిలేక ప్రజలు ఇబ్బందులు పడుతారు. అటువంటి కీలకమైన ముంపు సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ప్రజల శ్రేయస్సు, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు నివారణ చర్యలు చేపట్టకపోగా నిమ్మకు నీరెత్తినట్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. గతంలో అనేకసార్లు తెలంగాణ ఆత్మగల దార్శనికుడు కేసీఆర్ సమర్థ నాయకత్వంలో క్యాబినెట్ మంత్రిగా పోలవరం ముంపు సమస్యపై పెద్దఎత్తున తెలంగాణ పక్షాన వాదించాను. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి ముంపు నుంచి తెలంగాణవాసులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు అంటున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా ప్రజల ప్రయోజనాల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ సోయి లేకుండా వ్యవహరిస్తున్నది.

2022లో భద్రాచలం వద్ద 71.3 అడుగుల ఎత్తులో వచ్చిన వరద 22 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంగా నమోదైంది. పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72 మీటర్లు కాగా భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా 45.72 మీటర్లు. అంటే పోలవరం నిండితే భద్రాచలం ఎప్పుడూ ముంపు ప్రమాదంలోనే ఉంటుందని భావించాలి. భద్రాచలం వద్ద గోదావరి నది లోతైన బెడ్ లెవల్ 26 మీటర్లు బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిల్వ ఉంటుంది. ఇది నిత్యం తీవ్రమైన సమస్యగా మారుతున్నది. 900 ఎకరాల్లో నష్ట ప్రభావం కూడా ఉంటుంది. 2021లో పోలవరం కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత 2022లో వచ్చిన వరదల్లో బ్యాక్‌వాటర్ కారణంగా భద్రాచలంతో పాటు పరిసరాలు విలవిల్లాడాయి 40 శాతం భద్రాచలం పట్టణం జలమయమై, బాధితులు దీనావస్థలో రోడ్డున పడ్డారు. వరద బాధితులను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆదుకున్నది.

అప్పట్లో 22 లక్షల క్యూసెక్కుల వరదకే ఇంత నష్టం జరిగితే..ప్రాజెక్టు డిజైన్ ప్రకారం భవిష్యత్తులో 36 లక్షల నుంచి 50 లక్షల సెక్యూల వరద వస్తే ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టంతో పూర్తిగా మునిగిపోయే ప్రమాదం పొంచిఉన్నది. పలు అధ్యయనాల ప్రకారం 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతుందని తెలుస్తున్నది. కేవలం గ్రామాలే కాకుండా ఈ ప్రాంతంలోని భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్‌వాటర్ ముప్పు పొంచి ఉన్నది. దాదాపు ఐదువేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్‌బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్తు ప్రాజెక్టులకు ఈ బ్యాక్‌వాటర్ వల్ల తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుంది. దక్షిణాది అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రికి ఘనమైన ప్రాశస్త్యం ఉన్నది. అలాంటి రామాలయానికి కూడా పోలవరం ముంపు ముప్పు తప్పదు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పోలవరం ప్రాజెక్టు ద్వారా సంభవించే ముంపు ముప్పును నివారించేందుకు చర్యలు చేపట్టాలి. పునరావాస ప్యాకేజీ అమలు చేయాలి.

గోదావరి వరద తట్టుకునేందుకు కరకట్టలు కట్టాలి. ఇప్పటికే ఉన్న వాటి కరకట్టల ఎత్తును పెంచాలి. వర్షాకాలంలో స్లూయిస్‌ల దగ్గర వరద నీరు ప్రవహించదు కనుక ఆ సమయంలో మోటర్ల ద్వారా నీటిని తోడేయాలి. లోతట్టు ప్రాంత ప్రజలను మెరక ప్రాంతానికి తరలించి కాలనీలు నిర్మించాలి. ఎక్కువగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రహదారులపై ప్రవహించే వాగుల మీద చప్టాలు నిర్మించాలి. వంతెనలు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట రోడ్ల ఎత్తు పెంచాలి. తక్షణ చర్యలతో పాటు మౌలిక సదుపాయాల రక్షణ, ప్రజల భద్రత, పర్యావరణ, సాంకేతిక చర్యలు, పరిశ్రమలు, వారసత్వ ప్రాంతాల రక్షణ, విధానపరమైన చర్యలు వంటి పలు కీలక అంశాలపై దృష్టి సారించాలి. తెలంగాణ ప్రజల రక్షణకు, వారి శ్రేయస్సు కోసం పాటుపడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉన్నది. ముంపు నుంచి తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఆర్ఎస్ తరఫున, ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. మానవజాతిని కాపాడటం, భవిష్యత్‌తరాలకు మనం ఇచ్చే భద్రత. అదే అందరికీ శ్రీరామరక్ష.

నవగీతం తెలుగు దినపత్రిక
బుధవారం
1 జూలై 2026

# ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**నవగీతం, జగిత్యాల:** జిల్లా పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు జె. రవీందర్ (ఎస్ఐ), పి. రామచంద్రం (ఎస్ఐ), ఆర్. శ్రీనివాస్ (ఏఎస్ఐ), ఎస్. అంజనేయులు (ఏఎస్ఐ), జి. సత్యనారాయణ (ఏఎస్ఐ), మహ్మద్ సమ్దానీ (ఏఎస్ఐ), జి. మల్లారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్), ఎం. కిష్టారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్) లను జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించి, శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ, పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వేణు , సైదులు పోలీసు అధికారులు, సిబ్బంది మరియు రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలపై పెరుగుతున్న నమ్మకం..





**తల్లి దండ్రుల నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిలబెట్టాలి..**

**మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు..**

**మల్లాపూర్ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి అడ్లూరి..**

**నవగీతం,ధర్మారం:** గురుకుల పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుందని ఇందుకు ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులే ప్రధాన కారణం అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న అల్పాహారం, భోజనం మెనూ పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా కిచెన్, డైనింగ్ హాల్ తో పాటు స్టోర్ రూమ్ ను మంత్రి పరిశీలించారు. మల్లాపూర్ గురుకుల పాఠశాలకు సరఫరా చేసిన సన్న బియ్యాన్ని మంత్రి పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం ఎక్కువ ఉన్నందున బియ్యాన్ని వెనక్కి తీసుకొని సూపర్ ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని పంపించాలని పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారికి మంత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గురుకుల పాఠశాలలో 27 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్స్ తో పాటు విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల వస్తువులను అందించడానికి చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. గురుకుల పాఠశాలలో మైనర్ రిపేర్ల కోసం రూ. 69 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గురుకుల పాఠశాలలో పై తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుంది అని ఎందుకు తగ్గట్టుగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందని అందించాలని ఈ సందర్భంగా మంత్రి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. గురుకులాల్లో ఉండే విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురుకుల పాఠశాలను మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక నిధులు తీసుకువస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంత్రి వెంట ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లనాయక్ తదితరులు ఉన్నారు.



# జూలై 2 వ తేదీన ప్రైవేట్ విద్యాసంస్థల బందుకు పిలుపు:

**బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాలు**

**పెండింగ్ లో ఉన్న 10 వేల కోట్ల రూపాయల ఫీ రీయింబర్సుమెంట్స్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలి**



**నవగీతం, కరీంనగర్:** కరీంనగర్ నగర పట్టణంలో తెలంగాణ చౌక్ వద్ద బీసీ విద్యార్థి సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ అధ్యక్షతన బీసీ సంక్షేమ అనుబంధ సంఘల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు ఈ నెల జూలై 2వ తేదీన విద్యాసంస్థలు తరగతుల బంద్ పాటించాలని అదే విధముగా పదివేల కోట్ల రూపాయల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఫీజు రియాంబర్స్మెంట్ స్కీమును యధాతధంగా అమలు చేయాలని ఫీజుల బకాయిలు 10 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తు తెలంగాణ రాష్ట్ర బి.సి. సంక్షేమ సంఘం పిలువు మేరకు జూలై నెల 2వ తేదీన ఇంటర్ ,ఇంజనీరింగ్ ,ఫార్మసీ ,పీజి ,డిగ్రీ తదితర కోర్సులు పూర్తియిన వారికి కాలేజి యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీనితో విద్యార్థులు మరియు కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏ కాలేజిలో చూసిన విద్యార్థులు ఫీజులు కట్టలేక నరకయాతన అనుభవిస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరుఎత్తినట్టు వ్యవహారిస్తుంది.అలాగే జీవో నంబర్ 7 ను ఎత్తివేయాలి, యెద విధిగా పాత పద్దతిలోనే ఫీ రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ ను ప్రభుత్వం చెల్లించాలి,కావున ప్రైవేటు విద్యా సంస్థల యజమాన్యాలు ఈ యొక్క బందుకు స్వచ్ఛందంగా విద్యా సంస్థలకు బంద్ చేయాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అనుబంధ సంఘాల డిమాండ్ చేస్తున్నాము,ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్,బీసీ సంఘల నాయకులు దొగ్గలి శ్రీధర్,దొంపాటి మురళి,పీసర రాజు,మాదాసు సంజీవ్,గాజే ప్రజ్యోత్,కైతోజు బ్రమ్మ చారి,రవి గౌడ్,ఆశిష్, సుధాకర్, వెంకటస్వామి,సంజీవ్,తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు

## వేములవాడ డిపో ఏడీసీ దూస మనోహర్ సుజాతకు ఘన వీడ్కోలు



**నవగీతం,కొడిమ్యాల:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వేములవాడ డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్ గా 39 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన దూస మనోహర్ సుజాత మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కొడిమ్యాల మండల కేంద్రంలోని పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దూస మనోహర్ విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అల్వాల హనుమండ్లు, కొండ లక్ష్మణ్,చేట్టిపల్లి గణేష్,.ఎల్లం పరమేష్,చెన్న దేవేందర్,ఏల్ది గంగాధర్, మంచాల భూమేష్, అల్వాల సత్యనారాయణ,సామల శేఖర్,బాల దేవయ్య, నరేందర్‌లతో పాటు పద్మశాలి కుల బాంధవులు పాల్గొని దూస మనోహర్ సుజాతకు ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్బి డీఎస్పీ వెంకటరమణకు ఘన సన్మానం






**నవగీతం, జగిత్యాల:** జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వెంకటరమణ ని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో వెంకటరమణ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు. తన విధి నిర్వహణలో సమర్థత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని ఎస్పీ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సహచర అధికారులు, పోలీస్ సిబ్బంది వెంకట రమణ తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన సేవలను ప్రశంసించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్,రవి కరుణాకర్, లక్ష్మీనారాయణ, వేణు,ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలి.

**అధికారులకు జువ్వాడి కృష్ణా రావు సూచనలు**



**నవగీతం,కోరుట్ల:** మోహన్‌రావుపేట గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజల వివరాల నమోదు, ధృవీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రతి అర్హుల వివరాలు తప్పకుండా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జువ్వాడి కృష్ణారావు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి అందాలంటే సరైన వివరాలు నమోదు కావడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరికెళ్ళ లతిక నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సైదు గంగాధర్, ఉప సర్పంచ్ జాన వెంకటేష్, చిక్యాల కిషన్ రావు, మాజీ సర్పంచ్ పూదరి నర్సయ్య, పత్తిపాక రాజు, సంద మహేష్, బొడ్డు మల్లేషం, శనిగరపు వినోద్, జాగర్ల రెడ్డి, శనిగరపు రాజయ్య, ఆది ఎర్ర మల్లయ్య, పత్తిపాక రాజేశం, ఆది రాము, గుండవేణి రాజలింగం, తరాల అశోక్, బూత్ లెవెల్ ఏజెంట్స్ నల్లపు రాజేష్, నాయిని మహేందర్, శనిగరపు రాజేష్ బి ఎల్ వో,బి ఎల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
1 జూలై 2026

## మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై అసత్య ప్రచారాలు



**నవగీతం, మెట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణి (సీనియర్ ఐఏఎస్ అధికారిణి)లపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై మెట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీప్ ఫేక్, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వంటి ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ, మంత్రి దంపతులపై అనుచిత పోస్టింగులు పెడుతున్న మంథని బిఆర్ఎస్ నాయకులకు వారు ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. టీ.పి.సి.సి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెట్ పల్లి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బిఆర్ఎస్ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఒక గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మంత్రి పై, సీనియర్ ఐఏఎస్ అధికారిణి పై ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి చిల్లర రాజకీయాలకు పాల్పడే వారికి తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. శ్రీధర్ బాబు కి కేవలం మంథని నియోజకవర్గంలోనే కాకుండా, యావత్ తెలంగాణ వ్యాప్తంగా ఒక నిబద్ధత గల మంచి నాయకుడిగా పేరుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు అశేషమైన అనుచర గణం, అభిమానులు ఉన్నారనే విషయాన్ని బిఆర్ఎస్ నాయకులు మర్చిపోకూడదు.ఇంకోసారి సోషల్ మీడియా వేదికగా ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు చేస్తూ, వ్యక్తిగత దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, తాము కూడా చేతులకు పని చెప్పాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. చట్టపరంగా, రాజకీయంగా తగిన బుద్ధి చెప్తామని, తక్షణమే ఇలాంటి అసత్య ప్రచారాలు ఆపాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుతుబ్ పాషా, కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్, యూత్ నాయకులు నల్లూరి సాగర్, బైండ్ల శ్రీకాంత్, దినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సర్ పై అవగాహన సమావేశం



**నవగీతం,రాయికల్:** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీఎస్ గార్డెన్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలకు సర్ ప్రక్రియ లో బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, ప్రజలకు అందించాల్సిన సమాచారం గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టి. జీవన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆశించిన స్థాయిలో పాలన అందించడంలో విఫలమైందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రస్తుతం ప్రజలకు సక్రమంగా అందడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసే లక్ష్యంతో ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకులు తాటిపర్తి సీకే రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కటక్కం రవి, వైస్ చైర్‌పర్సన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, సర్పంచులు నల్ల స్వామిరెడ్డి, గుమ్మడి సంతోష్, గంగాధర్, నాయకులు గోపు మాధవి రాజిరెడ్డి, అనిల్, బర్కం మల్లేశం, రమేష్, ఎద్దండి భూమన్న, రాణి సాయి, గంగాధర్, రాకేష్ నాయక్, బత్తిని భూమన్న, వెల్పుల నవీన్తో పాటు వివిధ హోదాల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువా బహుకరణ



**నవగీతం,కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అగ్గిపెట్టెలో ఇమిడేంత సూక్ష్మంగా నేసిన ప్రత్యేక పట్టు శాలువాను భక్తిపూర్వకంగా స్వామి వారికీ సమర్పించారు.అత్యంత సన్నని పట్టుదారాలతో, ఎంతో శ్రమించి రూపొందించిన ఈ అరుదైన శాలువా ఆయన చేనేత నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. అగ్గిపెట్టెలో ఇమిడిపోయే ఈ పట్టు శాలువా ఆలయానికి వచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హరిప్రసాద్ శాలువాను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ ఆంజనేయస్వామి అనుగ్రహంతోనే ఈ కళాఖండాన్ని రూపొందించి సమర్పించే అవకాశం లభించడం ఆనందంగా ఉందని తెలిపారు.చేనేత కళ వైభవాన్ని భావితరాలకు పరిచయం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్--XII నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు ఎస్పీ సమీక్ష

జూలై 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం



**నవగీతం, జగిత్యాల** ఆపరేషన్ ముస్కాన్--శ×× కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల రక్షణ, పునరావాసం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్--శ×× కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆపరేషన్ ముస్కాన్ ప్రత్యేక బృంద సభ్యులతో అదనపు ఎస్పీ చేతన్ నితిన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.... జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నారుల హక్కుల పరిరక్షణ, విద్యకు దూరమైన పిల్లలను గుర్తించడం, బాల కార్మికులను రక్షించడం, తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చడం, భిక్షాటన చేస్తున్న చిన్నారులను రక్షించడం, ఆశ్రయం అవసరమైన బాలలకు తగిన సంరక్షణ కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు.18 సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనిలోనైనా బాలకార్మికులుగా నియమించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. హోటళ్లు, టీ స్టాళ్లు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, వ్యవసాయ క్షేత్రాలు, షాపింగ్ సముదాయాలు, నిర్మాణ పనులు, గృహాలలో పనిచేస్తున్న బాలలను ప్రత్యేకంగా గుర్తించి వారికి తక్షణ రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. రక్షించబడిన పిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం, వారి కుటుంబ పరిస్థితులను అధ్యయనం చేయడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, విద్యకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, అవసరమైతే ప్రభుత్వ బాలల సంరక్షణ గృహాలకు తరలించి పునరావాసం కల్పించడం జరుగుతుందని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం మరియు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పోలీస్ శాఖతో పాటు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు, బలవంతంగా పని చేయిస్తున్న పిల్లలు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, ఆశ్రయం అవసరమైన బాలలు లేదా తప్పిపోయిన వీధి బాలలు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్--100 కు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, కార్మిక శాఖ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ప్రతినిధులు, చైల్డ్‌లైన్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, ఆపరేషన్ ముస్కాన్ ప్రత్యేక బృంద సభ్యులు పాల్గొన్నారు.

## అన్నారుగూడెంలో ఎస్ఐఆర్ కార్యక్రమం

ఓటర్లకు బీజేపీ నాయకుల అవగాహన



**నవగీతం, తల్లాడ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా, ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం బూత్ నెం. 9 పరిధిలో మంగళవారం ఇంటింటి పర్యటన నిర్వహించారు. ?బీజేపీ నాయకుడు ఆపతి వెంకట రామారావు బూత్ లెవల్ ఆఫీసర్ నిమ్మటూరి వెంకటేశ్వర్లుతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులకు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని, ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఓటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## జూలై 15 నాటికి సీతారామ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి

నీటిపారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందజేత



**నవగీతం, తల్లాడ ప్రతినిధి:** జూలై 15వ తేదీ నాటికి సీతారామ ప్రాజెక్టు కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం మండల నీటిపారుదల శాఖ అధికారికి సంఘం నాయకులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ?ఈ సందర్భంగా రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు నల్లమోతు మోహన్‌రావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువ ద్వారా తల్లాడ మండలానికి నీరందిస్తే, సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలో రైతులు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా గోదావరి జలాలు సకాలంలో అందితే, రైతులు ధీమాగా పంటలు పండించుకుని ఆర్థికంగా స్థిరపడతారని ఆయన పేర్కొన్నారు. ?ప్రస్తుతం వరి సాగు చేపట్టే విషయంలో రైతాంగంలో నెలకొన్న సందిగ్ధతను తొలగించేందుకు, సంబంధిత శాఖ అధికారులు నీటి విడుదల తేదీని వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య, భూమా శ్రీనివాసరావు, ఆలస్యం బుచ్చయ్య, ఆలస్యం విజయ్, రావూరి అప్పారావు, అద్దంకి ఏసు, వేల్పుల కృష్ణయ్య, కారుమంచి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పన లక్ష్యం..

రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ వమంత్రి లక్ష్మణ్ కుమార్..





**నవగీతం,ధర్మపురి:** 2027 లో జరిగే గోదావరి పుష్కరాలు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోరకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో గోదావరి తీరంలో మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఆలయాల అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికి ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇందులో ధర్మపురి నియోజకవర్గానికి రూ. 117 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి క్షేత్రానికి పుష్కర స్నానాలు ఆచరించే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కొరకు తాగునీటి సౌకర్యం, డ్రెస్సింగ్ రూమ్స్, మరుగుదొడ్ల సౌకర్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ కొరకు గత గోదావరి పుష్కరాలకు, కృష్ణ పుష్కరాలకు పనులు చేసిన ప్రతినిధులతో కలిసి ఈరోజు పరిశీలించినట్లు మంత్రి తెలిపారు.మౌలిక సదుపాయాల కల్పనకు చేయాల్సిన ఏర్పాట్లపై కన్సల్టెన్సీ ప్రతినిధు లు పూర్తిస్థాయి నివేదిక అందజేస్తారని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.మంత్రి వెంట జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తోపాటు వేముల రాజు ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న , వార్డు కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్, ప్రశాంత్, వోజ్జల లక్ష్మణ్ లతో పాటు జక్కు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో సర్ ప్రక్రియపై అవగాహన సదస్సుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**నవగీతం, మెట్ పల్లి:** మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి, రాజేశ్వరరావుపేట, చెర్లకొండాపూర్, జగ్గాసాగర్, ఆత్మనగర్, రామలచక్కపేట గ్రామాల్లో నిర్వహించిన సర్ ప్రక్రియ పై అవగాహన సదస్సుల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ. సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు బాధ్యతగా పాల్గొని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. బూత్ స్థాయి నాయకులు, బి ఎల్ ఏ లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని తెలిపారు.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతుల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. అలాగే త్వరలో ప్రారంభం కానున్న భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఏ లు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు

## మిత్రుని పేరుతో ఫ్రెండ్స్ అన్నదానం..



**నవగీతం,మెట్ పల్లి :** చిన్నతనం నుండి వారితో కలిసి మెలిసి తిరిగిన మిత్రుడు మైలారపు ప్రశాంత్ (సురేష్) గత కొన్ని రోజుల క్రితం అకాల మరణం చెందడంతో ఆయన పేరుతో ఫ్రెండ్స్ కల్చరల్ సభ్యులు మంగళవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు బిట్లుగు కార్తీక్, ఆగ సురేష్, కమటం భరత్, పారిపెల్లి రాజు, చిట్యాల అరుణ్, కోట రాజేందర్, బాలే రాజ్ పాల్, కట్ట లక్ష్మణ్, , పారిపెల్లి సుధాకర్, రాంపెల్లి నాగేష్, సొగాల అంజి, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ పౌండర్ పుల్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
1 జూలై 2026

# రాయికల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ అశోక్ కుమార్

## సాంకేతిక వ్యవస్థలపై ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలి





**నవగీతం, రాయికల్** పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడం, నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు నాణ్యత, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ మంగళవారం రోజున రాయికల్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు విధానం,నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి, నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.స్టేషన్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు,రికార్డులు, సిబ్బంది విధుల కేటాయింపు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ సిబ్బంది యూనిఫాం నీట్ టర్న్‌అవుట్‌తో ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు.నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు.డయల్--100కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి అత్యంత వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు.ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణలో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను చైతన్యపరిచి,అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,ఐపీఎస్ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రూరల్ సీఐ సుధాకర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఎస్సై సుధీర్ రావు,గీత,రాజు మరియు పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెరుగుతున్న రౌడీయిజం, గుండాయిజం

**వికారాబాద్** : వికారాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రౌడీయిజం, గుండాయిజం పెరిగిపోతోందంటూ స్థానిక బిజెపి నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల కరీంపూర్ గేట్ సమీపంలో జరిగిన ఒక ఘటనను గురించి, గ్రామానికి సర్పంచ్‌గా ఉన్న బీర్ల రాజు పైనే కొందరు రౌడీ షీటర్లు కత్తులతో దాడికి తెగబడ్డారని బిజెపి నాయకుడు ఆరోపించారు. బాధిత సర్పంచ్ బీర్ల రాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు కొందరు పాత వీడియోలను అడ్డం పెట్టుకుని మండల నాయకులపై ఒత్తిడి తెస్తున్నారని, తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. అంతేకాకుండా, తాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన సమయంలో కూడా కాంగ్రెస్ నాయకుల నుంచి పోలీసులకు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయని, దీనివల్ల పోలీసులు తన ఫిర్యాదును సక్రమంగా తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు.?తనపై జరిగిన దాడిని తారుమారు చేసి, తానే కత్తులు తెచ్చినట్లుగా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి రౌడీలను, గుండాలను ప్రోత్సహిస్తే అది ఆ పార్టీకే నష్టమని ఆయన హెచ్చరించారు.

## గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిపి రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట** : గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సిపి రష్మీ పెరుమాళ్ మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సిపి పరిశీలించారు.అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సూచనలు చేశారు. పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు, సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన సిపి. సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులను పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను సందర్శించాలని , సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సిఐ రవిరాజు కి సూచించారు. సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు,హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని,అదేవిధంగా సిద్దిపేట సురక్ష నేత్ర లో భాగంగా సిసి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు,సిఐ రవిరాజు,ఎస్సైలు ఆరోగ్యం, రఘుపతి, కృష్ణ రెడ్డి, యోనుస్ ఖాన్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 64 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే క్లియర్ చేయాలి.. విద్యార్థుల ఆందోళన!

**హైదరాబాద్** : తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బహిష్కరణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు గుజ్జ సత్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగబద్ధమైన విద్యా అవకాశాలను కల్పించే సామాజిక న్యాయ పథకమని స్పష్టం చేశారు. వేలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల భవిష్యత్తు ఈ పథకంపై ఆధారపడి ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం

## జిల్లా విద్యాభివృద్ధే లక్ష్యంగా డీఈఓ అధ్యక్షతన సమన్వయ సమావేశం...

జి.ఓ 25 ప్రకారం వర్క్ అడ్జస్ట్‌మెంట్ అమలుపై చర్చ...



**నవగీతం, జగిత్యాల:** జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కె రాము అధ్యక్షతన జిల్లా కలెక్టర్ పరిపాలన కార్యాలయాల సముదాయం ఐడిఓఎస్ లో వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యుల, జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొదటగా పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో జిల్లా నాలుగ స్థానంలో నిలవడం, అలాగే ట్రిపుల్ ఐటి సీట్ల సాధనలో జిల్లా రాష్ట్ర స్థాయి లో రెండవ స్థానం నిలవడం పై జిల్లా విద్యాశాఖాధికారి కి రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు వేల్పుల స్వామి యాదవ్, ఎనగందుల రాజేంద్రప్రసాద్, మండల విద్యాధికారులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే విద్యారంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా జి.ఓ. నెం. 25 నిబంధనల మేరకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయబద్ధంగా అమలు చేయాల్సిన అవసరాన్ని సంఘాల ప్రతినిధులు ప్రస్తావించారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ఉపాధ్యాయుల సేవలను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా సమావేశంలో అభిప్రాయాలు, సూచనలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ టియుడబ్లుజె -హెచ్ 143 ప్రెస్ క్లబ్ ఏకగ్రీవ ఎన్నిక



**నవగీతం,మల్లాపూర్:** మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూ జె-హెచ్ 143 యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వెంకటేశ్వర దేవాలయం లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, గంగుల రాంగోపాల్, జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షులు శిఖరి రామకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు అంజు గౌడ్, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులు గా సుతరి కృష్ణమాచారి, అధ్యక్షులుగా రుద్ర రాంప్రసాద్, ఉపాధ్యక్షులు గా ఉడుగుల గంగాధర్, ప్రధాన కార్యదర్శి గా నూనె ఆంజనేయులు, కార్యదర్శి గా మోర సతీష్, కోశాధికారి గా ఆదరి రాజేందర్ ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు కనుక సంజీవ్, జిల్లా కార్యదర్శి తోకల పవన్, ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంబి మహేష్,తాజా మాజీ అధ్యక్షులు ముత్యాల రమేష్,ఆకుతోట నర్సయ్య, జరుపుల రమేష్, వంగ శేఖర్, దొంతి సుధాకర్, ఎగ్యారపు శ్రీనివాస్, బండారి వెంకటేష్, ముదంపల్లి మహేష్ పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించిన రైతులు



**నవగీతం,కొడిమ్యాల:** కొడిమ్యాల మండలంలోని పూడూరు, తిర్మలాపూర్ రైతు వేదికల్లో మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను విడుదల చేశారు. పూడూరు రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్, మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, పూడూరు సర్పంచ్ అగుర్ల మల్లేశం, కొడిమ్యాల సర్పంచ్ జీవన్ రెడ్డి, పూడూరు పీఏసీఎస్ చైర్మన్ బండ రవీందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కె. రాజేష్, రామకిష్టాపూర్ సర్పంచ్ నేరెళ్ల మహేష్, ఉపసర్పంచ్‌లు, వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎంపిడిఓ



**నవగీతం తల్లాడ:** మల్లవరం గ్రామంలో నూతనంగా చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) శ్రీధర్ రాజు , సర్పంచ్ కటిక కిరణ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గ్రామాభివృద్ధికి రోడ్ల నిర్మాణం ఎంతో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎర్రి నరసింహారావు , ప్రముఖ రైతు అయినాల రామలింగయ్య , స్థానిక పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్ మియా వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా ఉపాధ్యాయురాలి పదవీ విరమణ





**నవగీతం తల్లాడ :** వెంగన్నపేట స్థానిక యూపీఎస్ వెంగన్నపేట పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు శ్రీమతి కోటగిరి రాధా 30 ఏళ్ల సుదీర్ఘ సేవ అనంతరం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆళ్ళ నరసింహారావు అధ్యక్షతన ఘనంగా సన్మాన మహోత్సవం నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి దామోదర ప్రసాద్, నూతనకల్ కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్ రాధా మేడమ్ సేవలను కొనియాడారు. మూడు దశాబ్దాల పాటు ఆమె పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, క్రమశిక్షణకు అంకితభావంతో కృషి చేసి భావితరాలకు మార్గదర్శకంగా నిలిచారని ప్రశంసించారు.సన్మాన సభలో రాధా తన విజయానికి కారణమైన కన్నతల్లి శ్రీమతి దుర్గమ్మ కి పాదాభిషేకం చేసి కృతజ్ఞత చాటుకున్నారు. ఈ దృశ్యం సభికులను ఎంతగానో కదిలించింది. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజాన్, పీఆర్‌టీయూ నాయకులు రాయల నరసింహారావు, ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాలకృష్ణ, తాత భాస్కర్ రావు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాధా ని ఘనంగా సన్మానించి, ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
1 జూలై 2026

## మళ్లీ పాత రూట్లోకి అల్లరి నరేష్..

### పుట్టినరోజు కానుకగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ రిలీజ్!



టాలీవుడ్ సీనియర్ హీరో, కామెడీ కింగ్ అల్లరి నరేష్ నేడు తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సీరియస్ ఎమోషనల్ కథలతో అలరించిన నరేష్, చాలా విరామం తర్వాత మళ్లీ తన మార్క్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి "కామెడీ గోస్ కాస్మిక్" అనే ఒక క్రేజీ ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు, ఇది సినిమాలోని వినోద స్థాయి ఏ రేంజ్‌లో ఉండబోతోందో ముందే హింట్ ఇస్తోంది. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ఈ సారి నమ్మండి.. నేను మాట్లాడను

టాలీవుడ్ అక్కినేని అఖిల్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైజాగ్ వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన అఖిల్ ఈ మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. నా సినిమా వచ్చి ఇప్పటికీ మూడేళ్లయిందని.. సారీ బ్రదర్.. ఈ విషయంలో నన్ను క్షమించాలంటూ అభిమానులను కోరారు అఖిల్. నా గుండెలపై చేయి వేసుకుని చెబుతున్నా.. ఈ సారి నేను మాట్లాడను.. కేవలం నా సినిమానే మాట్లాడుతుందన్నారు. ఇంతకుమించి నేనేం చెప్పకూడదు.. రెండు రోజులుగా నేను నిద్రపోలేదు.. కళ్లద్దాలు పెట్టుకుని వద్దామనుకున్నానని తెలిపారు. మిమల్ని చూస్తుంటే జూలై 10 వరకు పనిచేసే ఎనర్జీ వచ్చిందని అభిమానులను ఉద్దేశించి అఖిల్ మాట్లాడారు.






## రావు బహదూర్ మూవీ.. ట్రైలర్ రిలీజ్

సత్యదేవ్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ రావు బహదూర్. ఈ చిత్రానికి వెంకటేష్ మహా దర్శకత్వం వహంచారు. ఈ మూవీలో దీపా థామస్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. గతంలో ఆయన డైరెక్ట్ చేసిన 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలు టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ చిత్రాన్ని మహేశ్ బాబు, నమ్రతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ మహేశ్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఈ ట్రైలర్ ట్రైలర్ చూస్తుంటే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మునుపెన్నడు చూడని తెలుగు సినిమా రావు బహదూర్ అంటూ ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు మహేశ్ బాబు. కాగా.. ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, కునాల్ కౌశిక్, మాస్టర్ కిరణ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు స్మరణ్ సాయి సంగీతమందించారు.

## సుడిగాలి సుధీర్ సినిమా.. 'లైలం బాబు'గా శివాజీ



సుడిగాలి సుధీర్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. శివాజీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. 'లైలం బాబు' పాత్రలో శివాజీ తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ తో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.



## పొలిటికల్ ఎంట్రీపై రాఘవ లారెన్స్ యూటర్న్.. అభిమానులకు భారీ షాక్!

నటుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొద్దిరోజులుగా కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని పూర్తిగా తన అభిమానులకే వదిలేస్తున్నట్లు లారెన్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పోటీ చేసి తప్పుకున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) నియోజకవర్గం నుంచి లారెన్స్ బరిలోకి దిగబోతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా రూమర్స్ చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తూ, తన రాజకీయ భవిష్యత్తుపై లారెన్స్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియా వేదికగా దాదాపు 16 నిమిషాల నిడివి గల ఒక సుదీర్ఘమైన వీడియోను పోస్ట్ చేసిన లారెన్స్, తన పొలిటికల్ ఎంట్రీపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని, తాను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే అంతటితో ఆగకుండా, తాను ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన రాజకీయాల్లోకి రానని అనుకోవద్దని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ కేవలం సినిమాలపైనే ఉందని, ఒప్పుకున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యతని వివరించారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల్లో నిలబడకపోయినా, తన ట్రస్ట్ ద్వారా సమాజానికి చేసే సేవలు మరియు సహాయ కార్యక్రమాలు ఎప్పటిలాగే నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ కాంచన హీరో వెల్లడించారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.